జిల్లా స్థాయి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

యువత క్రీడల్లో రాణించాలి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, ఫిబ్రవరి 25: గ్రామీణ ప్రాంతాల యువకులు క్రీడల్లో రాణించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం షాబాద్ మండల కేంద్రంలోని పీఆర్ ఆర్ స్టేడియంలో దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రీడాపోటీలను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, స్థానిక జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని చెప్పారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రూ.50లక్షలతో షాబాద్‌లో స్టేడియం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తన తండ్రి దివంగత నేత రాజేందర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ప్రతి ఏడాది వారం రోజుల పాటు జిల్లా స్థాయి క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, క్రీడల నిర్వాహకులు మహేశ్‌యాదవ్, రమేశ్ యాదవ్, ధనుంజయ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బోరాంచ రామచంద్రారెడ్డి, కుమ్మరి దర్శన్, చందిప్ప జంగయ్య, కృష్ణాగౌడ్, సుదర్శన్, శంకర్, అశోక్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్రంఖాన్, ఇమ్రాన్, అజయ్, అవిలాశ్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, చెన్నయ్య, మద్దూరి పాండు, రామ్మోహన్‌గుప్తా, సంజీవ, శేఖర్ పాల్గొన్నారు.

సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఘనంగా సేవాలాల్ జయంతి

పురవీధుల గుండా కొనసాగిన శోభాయాత్ర

ఆమనగల్లు, ఫిబ్రవరి 25 : గిరిజనుల ఆరాధ్య దైవం సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీలో ఆదివారం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విచ్చేశారు. పట్టణంలోని సేవాలాల్ గుట్టనుంచి శోభాయాత్ర ప్రారంభం కాగా, పుర వీధుల గుండా కొనసాగింది. శోభాయాత్రలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పాల్గొన్నారు. అనంతరం సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోగ్ బండార్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం సంత్ సేవాలాల్ మహారాజ్ చూపించిన మార్గం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నేనావత్ అనురాధ, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు పత్యానాయక్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, గిరిజన సంఘాల నాయకులు రవీందర్‌నాయక్, కృష్ణానాయక్, దశరథ్‌నాయక్, శ్రీనూనాయక్, పంతూనాయక్, విజయ్‌రాథోడ్, కాంగ్రెస్ నాయకులు మెకానిక్ బాబా, సురేశ్‌నాయక్, గణేశ్‌నాయక్, పాల్గొన్నారు.

ఆమనగల్లులో సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన అభ్యర్థులు

యాచారం, ఫిబ్రవరి 25 : 2008 డీఎస్సీలో సాధారణ మెరిట్ ఆధారంగా ఉద్యోగవకాశాలు కోల్పోయిన బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు ఆదివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. డీఎస్సీ 2008 సెంకడరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు ఎంపికై, సర్టిఫికెట్ వెరిఫికేషన్ అయిపోయిన తరువాత ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేసే సమయంలో మాకు అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే ముందు వాపోయారు. 15ఏండ్లుగా నిరుద్యోగంతో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. హైకోర్టు, సుప్రీం కోర్టులు సైతం 2008 డీఎస్సీ బాధితుల పట్ల సానుకూల నిర్ణయం తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్యాయం జరిగినందున తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వమే మాకు ఉద్యోగం ఇప్పించాలని కోరారు. హైకోర్టు ఆదేశాలను అనుసరిస్తూ ప్రభుత్వం మాకు వెంటనే ప్రజాపాలన ద్వారా న్యాయం చేసి మా ఉద్యోగాలు మాకు ఇప్పించాలని కోరారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి 2008డీఎస్సీ బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. వారి వెంట జంగయ్య, మహేందర్, రవి, మహేందర్ ఉన్నారు.

బీసీ రిజర్వేషన్లను పెంచుతాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

షాద్‌నగర్, ఫిబ్రవరి 25 : ప్రభుత్వం బీసీ కులగణన చేసిన అనంతరం బీసీ రిజర్వేషన్లను 44 శాతానికి పెంచేందుకు సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను బీసీ ఉద్యోగులు సన్మానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు 34 నుంచి 27 శాతానికి పడిపోయిందని, కుల గణన అనంతరం బీసీల రిజర్వేషన్లు కచ్చితంగా 44 శాతానికి పెరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. జీవో 317 వలన ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించిందని, త్వరలోనే ఉద్యోగులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాసులు, వెంకటేశ్, సత్యం, రాజు, బీసీ సంఘం నాయకులు రాములు, సురేశ్, శ్రీనులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం

గోవిందా నామస్మరణతో మార్మోగిన కడ్తాల్ పట్టణం

రథోత్సవానికి తరలివచ్చిన నాయకులు, భక్తులు

మండల కేంద్రంలో జరిగిన రథోత్సవంలో పాల్గొన్న నాయకులు, భక్తులు

కడ్తాల్, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున ఆలయంలో దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలకు గ్రామ ప్రధాన పురోహితుడు వెంకటేశ్వరశర్మ, శ్రీధర్ ఆధ్వర్యంలో హోమంతోపాటు పూజలు చేశారు. అనంతరం పెద్ద తేరును గ్రామంలోని ప్రధానవీధులగుండా ఊరేగించారు. సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్ఐలు, 20 మంది కానిస్టేబుళ్లతో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. అంతకుముందు ఆలయంలో ఆంజనేయస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో భజనలు నిర్వహించారు. అనంతరం చెన్నకేశవస్వామి ఆలయ సేవాపరులను ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి సత్కరించి దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ తిరునగరి వేణుగోపాల్, ఆలయ కమిటీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, యాదయ్యగౌడ్, నరేందర్‌రెడ్డి, కిరణ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, రాఘవేందర్, శాయిరెడ్డి, జంగారెడ్డి, గణేశ్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, సత్యం, రాజు, రాజేశ్, జగన్, మహేందర్‌రెడ్డి, మహేశ్, వెంకటేశ్, శ్రీకాంత్, శ్రీను, బాబు, యాదయ్య, అనిల్, శివ, జగదీశ్, లక్ష్మయ్య, బుచ్చయ్య, నర్సింహ, భిక్షపతి, బ్రహ్మచారి, రవిచారి, ప్రేమ్‌చారి, సాయిప్రభుచారి, లక్ష్మణాచారి, లింగాచారి, జంగాచారి, మహేశ్‌చారి, రమేశ్‌చారి, సందీప్‌చారి, శ్రీనివాసాచారి, ఆలయ అనువంశీక అర్చకులు రఘురాం, వేణుగోపాల్, శ్రీధర్, శ్రీమన్నారయణ, నర్సింహ్మ, పవన్‌కల్యాణ్, భక్తులు పాల్గొన్నారు.

రథోత్సవం ముందు కోలాటం ఆడుతున్న కళాకారులు

వేణుగోపాల స్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపు

మంచాల, ఫిబ్రవరి 25: మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో వేణుగోపాల స్వామి, రుక్మిణి సత్యభామల రథోత్సవం వైభవంగా కొనసాగుతున్నది. ఆదివారం ఉదయం ఉత్సవ మూర్తులను రథోత్సవంపై ఊరేగించారు. భక్తుల కోలాటాలు, కళాకారుల ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. రథోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎంపీటీసీలు చీరాల రమేష్, కావలి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కొంగరవిష్ణు వర్ధన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జంగయ్యగౌడ్‌లతో ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

నేత్ర పర్వంగా శివపార్వతుల కల్యాణం

షాబాద్, ఫిబ్రవరి 25: మండలంలోని సర్దార్‌నగర్‌లో ఆదివారం శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 11 గంటలకు స్వామివారి ఎదుర్కోళ్లు అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో కల్యాణం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఆదిదంపతుల కల్యాణాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

షాబాద్ మండలం వెంకమ్మగూడలో బోనాలతో వెళుతున్న మహిళలు

ఘనంగా మల్లన్న బోనాలు

షాబాద్, ఫిబ్రవరి 25: షాబాద్ మండలంలోని వెంకమ్మగూడ గ్రామంలో మల్లన్న బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి గ్రామస్తులంతా మల్లన్న దేవాలయం వద్ద పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనాలతో ఊరేగింపు చేపట్టారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దూరి శకుంతల, మాజీ ఎంపీటీసీ మద్దూరి పాండు, సహకార సంఘం వైస్ చైర్మన్ మల్లేశ్, మాజీ ఉప సర్పంచ్ బొజ్జయ్య, పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

షాద్‌నగర్, ఫిబ్రవరి 25 : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ షాద్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27న షాద్‌నగర్ పట్టణంలోని పెన్షనర్ భవన్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వైద్య శిబిరంలో కామినేని దవాఖాన వైద్యులు సేవలు అందిస్తారని వివరించారు. ఈ వైద్య శిబిరాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

పెద్ద అంబర్‌పేట, ఫిబ్రవరి 25 : ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠినంగా వ్యవహరిస్తామని అబ్దుల్లాపూర్‌మెట్ మండల తహసీల్దార్ రవీందర్‌దత్తు హెచ్చరించారు. ఆదివారం పెద్ద అంబర్‌పేట గ్రామంలోని సర్వే నంబర్ 64/పీలో వెలసిన అక్రమ నిర్మాణాలను జేసీబీ సాయంతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి అవుతునట్లు గుర్తిస్తే రెవెన్యూ అధికారులకు సమాచారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయాంజాల్, ఫిబ్రవరి 25 : కరాటేతో విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవడంతో పాటుగా క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం ఏర్పడుతుందని రంగారెడ్డి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. ఆదివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడలోని ఓ గార్డెన్‌లో వీ ఎన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష, సర్టిఫికేషన్ ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీసీసీబీ చైర్మన్ సత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు కరాటేతో మార్షల్ ఆర్ట్స్‌లో నైపుణ్యంతో పాటుగా క్రమ శిక్షణ, ఏకాగ్రత, ఆత్మ విశ్వాసం పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్తకుర్మ శివకుమార్, వీ ఎన్ అకాడమీ ఫౌండర్, చైర్మన్ నరేందర్, ప్రశాంత్, శ్రీనివాస్, నర్సింగ్, గణేశ్, సంపత్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ఇబ్రహీంపట్నం రూరల్, ఫిబ్రవరి 25 : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్ అన్నారు. మండల పరిధిలోని పోచారం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.27 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు ఘన సన్మానం

మంచాల, ఫిబ్రవరి 25 : మంచాల మండలం కొర్రవాని తండా మాజీ సర్పంచ్ కొర్ర లక్ష్మిని ఆదివారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. సర్పంచ్‌గా పనిచేసిన లక్ష్మి గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. సీసీ రోడ్లు, భూగర్భడ్రైనేజీ, తదితర సమస్యలను పరిష్కరించారని అన్నారు. సన్మానించిన వారిలో కేస్యా, మెగావత్ రఘు, కిషన్, రమేశ్, శ్రీను. భాస్కర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

షాద్‌నగర్, ఫిబ్రవరి25: రైలు కిందపడి ఓ గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం చటాన్‌పల్లి రైల్వే గేట్ సమీపంలో ఉదయం 9 గంటల సమీపంలో రైలు కిందపడి 25 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడు పసుపు కలర్ టీ షర్ట్, నీలం రంగు ప్యాంట్‌ను ధరించినట్లు వివరించారు. ఈ ఘటనపై రైల్వే కానిస్టేబుల్ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9441407039ను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని షాద్‌నగర్ సర్కారు దవాఖానకు తరలించారు.

ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘనంగా అపూర్వ సమ్మేళనం

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 24 పట్టణంలోని ప్రగతి విద్యాలయం ఉన్నతపాఠశాలలో 2003-04విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన 50మంది ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల రాయికల్ టోల్‌గేట్ సమీపంలోని పీఎస్ఆర్ రిసార్ట్‌లో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆత్మీయంగా పలుకరించుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రాధాకృష్ణ, నరేందర్, బాల్‌రాజు, రఘుమారెడ్డి, నాగేశ్వర్‌రావు, ఇంద్ర, రఫత్‌సుల్తానా, ఉమాదేవి, సువర్ణ, అనురాధ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగినప్పుడే తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

శంకర్‌పల్లి : 2004-2006లో శ్రీసాయి కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం శంకర్‌పల్లి పరిధిలోని ప్రగతి సుధామలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకొన్నారు. చిన్ననాటి విషయాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మహేశ్, గోపాల్, మాణిక్యం, సంజీవ, నరేందర్‌రెడ్డి, జ్యోతి, లలిత, మహేందర్‌రెడ్డి, గోపాల్, సువర్ణ, సుజాత పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నందిగామ, ఫిబ్రవరి25: బైకు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంట్ పోల్‌ను ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చేగూరు రోడ్డులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ మండలంలోని కన్హా శాంతి వనంలో పని చేసేందుకు నేపాల్ రాష్ట్రానికి చెందిన రాం బహదూర్(45), రాం కమ్మీ(42) శనివారం వచ్చారు. ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై తిమ్మపూర్‌కు వెళుతుండగా రాజన్ స్టీల్ పరిశ్రమ సమీపంలోకి రాగానే బైకు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కరెంట్ పోల్‌ను ఢీకొట్టడంతో రాం బహదూర్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాం కమ్మీకి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నందిగామ పోలీసులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న కార్మిక సంక్షేమ సంఘం నాయకులు

షాద్‌నగర్, ఫిబ్రవరి 25 : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కేశంపేట మండలం వేముల్‌నర్వ గ్రామానికి చెందిన అనిల్‌కుమార్, ఫరూఖ్‌నగర్ మండలం మాల్ ఎలికట్ట గ్రామానికి చెందిన దుర్గప్రసాద్ కుటుంబాలకు ఆదివారం రూ.20వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించినట్లు కార్మిక సంక్షేమ సంఘం నాయకులు ప్రభాకర్ ఆదివారం తెలిపారు. టూ వీలర్ మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు కార్మిక సంక్షేమ సంఘంతో పాటు టూ వీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్‌గౌడ్, అశోక్‌రెడ్డి, సిరాజ్, దశరథ్, నర్సింహారెడ్డి, మల్లేశ్, భాస్కర్, రాజేశ్, విజయ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 25 : ఉచిత వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ కౌన్సిలర్ రోహిణీబ్రహ్మానంద రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని కేతన కాలనీలో వెంకటేశ్వరకాలనీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి వైద్యులు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేతనకాలనీ ప్రెసిడెంట్ రాజేశ్వర్‌శర్మ, కాలనీ జనరల్ సెక్రటరీ జయరాం, పవన్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.